
నమస్తే తెలంగాణ

# వికారాబాద్

1 | హైదరాబాద్, ఆదివారం 15 జూన్ 2025 | VIKARABAD

పిల్లర్ల దశలోనే ఉన్న జిల్లాలోని మెడికల్ కళాశాల భవనం పనులు

## అనంతగిరిలో పర్యాటకుల సందడి

వికారాబాద్, జూన్ 14 : వికారాబాద్ పట్టణానికి అతి సమీపంలో ఉన్న అనంతగిరికి భక్తులు, పర్యాటకుల తాకిడి పెరిగింది. శనివారం సెలవు దినం కావడంతో భక్తులు అనంతపద్మనాభస్వామిని దర్శించుకున్నారు. అనంతరం నందిఘాట్‌లో, నూతనంగా ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్లలో సెల్ఫీలు, ఫొటోలు దిగి.. కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపారు.



# ఆగుతూ.. సా..గుతూ!

### కొరవడిన అధికారుల పర్యవేక్షణ

## నత్తే నయం అనేలా మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

**పనులు ప్రారంభించి ఏడాది దాటినా ఇంకా బేస్‌మెంట్ దశలోనే..**

- కేసీఆర్ ప్రభుత్వంలో బిల్లాదాఖలాలోని 30 ఎకరాల్లో మెడికల్ కాలేజీ పనులు ప్రారంభం
- రూ.200 కోట్లు మంజూరు
- రెండేండ్లుగా తాత్కాలిక మెడికల్ కాలేజీలోనే కొనసాగుతున్న తరగతులు
- అరకొర సౌకర్యాలతో తాత్కాలిక హాస్టళ్లలో ఇబ్బంది పడుతున్న మెడికల్ విద్యార్థులు

వికారాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభమై దాదాపు ఏడాది దాటినా పూర్తి కావడం లేదు. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయని పలువురు మండిపడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో జరిగే పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు..ప్రభుత్వ వైద్యక శాశాల నిర్మాణంలో పట్టించుకోవడంలేదనే ప్రచారం జరుగుతున్నది. జిల్లాకొక ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసి, పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడమే లక్ష్యంగా మాజీ సీఎం కేసీఆర్ వికారాబాద్ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొడంగల్‌కు ప్రత్యేకంగా మెడికల్ కాలేజీని మంజూరు చేసుకున్న సీఎం... ఆ పనులు శరవేగంగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండగా.. జిల్లాకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని మాత్రం వికారాబాద్, పరిగి, తాండూరు సెగ్మెంట్ల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు మాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. ఆ భవన నిర్మాణ పనులు ప్రస్తుతం పిల్లర్ల దశలోనే ఉన్నాయి. పనులు ప్రారంభమైన నాటి నుంచి అధికారులు పర్యవేక్షిస్తే ఇప్పటివరకు 50 శాతానికిపైగా పూర్తి కావాల్సి ఉండగా, 10 శాతం కూడా పూర్తికాకపోవడం గమనార్హం. ఇందుకు కారణం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులివ్వకపోవడంతోపాటు మరోవైపు అధికారుల పర్యవేక్షణ కొరవడడమే. పనులు నత్తనడకన సాగితే ప్రభుత్వ మెడికల్ కాలేజీ పూర్తి అయ్యేందుకు మరో రెండు, మూడేండ్లు పట్టే అవకాశముందని పలువురు జిల్లావాసులు పేర్కొంటున్నారు. కాగా, వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బిల్లదాఖల భూముల్లోని 30 ఎకరాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని రూ.200 కోట్లతో చేపట్టారు.



### తాత్కాలిక కాలేజీలోనే సాగుతున్న తరగతులు..

2023-24 విద్యాసంవత్సరం నుంచి జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభమయ్యాయి. గత రెండేండ్లుగా అనంతగిరిలోని టీబీ శానిటోరియంలో మరమ్మతులు చేసిన భవనాల్లో తాత్కాలికంగా మెడికల్ కాలేజీ తరగతులను కొనసాగిస్తున్నారు. అయితే టీబీ శానిటోరియంలోనే రెండేండ్లపాటు క్లాసులు నిర్వహించేందుకు గత ప్రభుత్వం అనుమతించింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూస్తుంటే మరో రెండేండ్లు కూడా తాత్కాలిక భవనాల్లోనే తరగతులు కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం రెండు లెక్చర్ హాళ్లు, అనాటమీ, ఫిజియోలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి ల్యాబ్ గదులున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో ఈ మెడికల్ కాలేజీలో 100 మంది విద్యార్థులకు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించగా, 2024-25లో మరో వందమంది విద్యార్థులు ఇందులో చేరారు. అరకొర సౌకర్యాలతోనే మెడికల్ కాలేజీ నిర్వహణ సాగుతున్నది. అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ అస్సలు పట్టించుకోవడంలేదు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హాస్టళ్లలో అరకొర వసతులతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థుల వసతి గృహం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ భవనంలో కొనసాగుతుండగా.. విద్యార్థినుల హాస్టల్ వసతిని శ్రీఅనంతపద్మనాభ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేశారు. హాస్టళ్లలో వసతులు కల్పించాలని పలు మార్లు మెడికోలు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా నామమాత్రంగా చేపట్టి చేతులు దులుపుకొన్నారు.



### అందని వైద్యం

# గాలిలో ప్రాణాలు

## రంగారెడ్డి జిల్లాలోని జాతీయ రహదారుల్లో గోల్డెన్ అవర్‌లో అందని అత్యవసర చికిత్స

- హైవేలపై పలు ప్రభుత్వ దవాఖానలున్నా ఫలితం నిల్
- డాక్టర్లు లేరని.. స్కానింగ్ యంత్రాల్లేవని చెప్పి ఉస్మానియా దవాఖానకు వెళ్లాలని సూచిస్తున్న అక్కడి సిబ్బంది
- క్షతగ్రాతులకు ప్రైవేట్ దవాఖానలే దిక్కు..
- ఉన్నతాధికారులు స్పందించాలని బాధితుల వేడుకోలు

రంగారెడ్డి, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని పలు జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో అత్యవసర వైద్యం అందక పలువురి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. హైవేలపై ప్రభుత్వ దవాఖానలున్నా సరైన సౌకర్యాల్లేవని.. డాక్టర్లు అందుబాటులో లేరని చెప్పి ఉస్మానియా దవాఖానకు పంపిస్తున్నారు. క్షతగాత్రులు ప్రమాద స్థలం నుంచి నగరానికి చేరుకునే లోపే ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. సకాలంలో వైద్యం అందితే బతికేవారని వారిని పరీక్షించిన వైద్యులు పేర్కొంటున్నారు. జిల్లా పరిధిలో హైదరాబాద్-నాగార్జునసాగర్, హైదరాబాద్-శ్రీశైలం, హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగళూరు వంటి జాతీయ రహదారులున్నాయి. ఈ దారుల్లో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. ప్రమాదాలు జరిగిన వెంటనే అత్యవసర వైద్యం కోసం అందుబాటులో ఉన్న ఆస్పత్రికెళ్తే.. అక్కడి సిబ్బంది నగరంలోని ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారు. అలాగే, ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌లకు ఫోన్ చేసినా వారు సకాలంలో రాకపోవడంతో బాధితులు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. అక్కడ అత్యవసర వైద్య సేవల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు.

### వైద్యుల్లేక అందని వైద్యం..

యాచారం మండలంలోని నాగార్జునసాగర్ రోడ్డులో తమ్మలోగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా .. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలో ఉన్న యాచారం ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్తే వైద్యులు లేరని అక్కడి నర్సులు చెప్పారు. అక్కడి నుంచి ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లినా వైద్యులు లేరని తెలియడంతో వెంటనే నగరంలోని ఒక ఆస్పత్రికి తరలించారు. అలాగే, ఇబ్రహీంపట్నం ఠాణా పరిధి కొహెడ ఎక్స్‌రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో పంకజ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సకాలంలో అంబులెన్స్ రాకపోవడం..అరగంట పాటు రోడ్డుపై తీవ్ర ఇబ్బంది పడి చివరకు ప్రాణాలు వదిలాడు. శేరిగూడ సమీపంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని కింద పడి.. సకాలంలో వైద్యం అందక అక్కడికక్కడే మృతిచెందాడు. ఇలాంటి ఘటనలు ప్రతిరోజూ జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై జరుగుతూనే ఉన్నాయి.

### రక్తమోడుతున్న సాగర్ రహదారి..

నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారి రక్తమోడుతున్నది. ఈ దారిలో ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నది. 2023లో 72 మంది మరణించగా, 50 మంది గాయపడ్డారు. 2024లో 130 మంది దుర్మరణం చెందగా 150 మంది గాయపడ్డారు. 2025 జూన్ వరకు 85 ప్రమాదాల్లో 29 మంది మృతిచెందగా, 85 గాయపడ్డారు. అయినా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల్లో చలనం మాత్రం రావడంలేదు.

### కనిపించని పెట్రోలింగ్ వాహనాలు

ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించేందుకు మొబైల్ పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేశారు. కానీ, ఇటీవల ఆ వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదాల్లో ఎక్కువమంది గోల్డెన్ అవర్‌లో సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు.

### ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల పేరుతో దోపిడీ

ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రభుత్వ దవాఖానల్లో క్షతగాత్రులకు వైద్యం అందకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులే వారికి దిక్కవుతున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి వివిధ చికిత్సల పేరుతో డాక్టర్లు లక్షల రూపాయలను వసూలు చేస్తున్నారు. మరోవైపు 108 సిబ్బంది కూడా ఆస్పత్రుల వారితో కమ్మక్కై ప్రభుత్వ దవాఖానలకు బదులు ప్రైవేట్‌కు తీసుకెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. హైవేల సమీపంలో ఉన్న మాల్, యాచారం, తుర్కయాంజాల్, బొంగ్లూరు, కందుకూరు, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు వంటి జాతీయ రహదారులపై ఉన్న ఆస్పత్రుల్లోనూ క్షతగాత్రుల నుంచి రూ.లక్షలు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సాగర్, శ్రీశైలం రహదారుల్లో పలు ప్రభుత్వ ఆస్పత్రులన్నాయి. ఈ దారుల్లో రాత్రిపూట గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానలకు తరలిస్తే డాక్టర్లు లేరని, స్కానింగ్ వంటివి లేవని నగరంలోని ఉస్మానియాకు తీసుకెళ్లాలని సూచించి.. పంపిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.



### 'మాన్‌సూన్ ఎమర్జెన్సీ' టెండర్లకు నోటిఫికేషన్

సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ టెండర్ల కోసం శనివారం హైడ్రా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు వాహనాలతో కూడిన బృందాల కోసం రూ. 20కోట్ల అంచనాతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. స్టాటిక్ టీమ్స్‌లకు మరో రూ.8కోట్ల నుంచి రూ.9 కోట్ల వరకు అవసరమని అంచనా వేశారు. కాగా ఈ బృందాల బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం బల్దియాకు కాకుండా హైడ్రాకు అప్పగించడంతో వాటిని త్వరగా ఏర్పాటు చేసేందుకు కసరత్తు మొదలైంది. శనివారం సాయంత్రం నుంచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. మొత్తం 130 టీమ్స్ కోసం టెండర్లు ఆహ్వానిస్తుండగా, మూడ్రోజుల్లో ప్రీబిడ్ మీటింగ్ ఏర్పాటు చేసి సంబంధిత ఏజెన్సీలు చేసే పనుల గురించి హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరించనున్నారు. ఆ తర్వాత టెండర్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను స్వీకరించి.. తక్కువ కోట్ చేసిన వారికి బాధ్యతలను అప్పగిస్తామని, ఈ ప్రక్రియ మొత్తం వచ్చే గురువారంలోగా పూర్తి చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

### ఆటో రెటిరోఫిట్మెంట్ చార్జీలు ప్రభుత్వమే భరించాలి

పెట్రోల్, డీజిల్ ఆటోలకు రెటిరోఫిట్మెంట్‌ను ప్రభుత్వమే ఉచితంగా చేయించాలని టీఏటీయూ అధ్యక్షుడు మారయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఆటోలకు గిరాకీ లేక డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఇటీవల 25వేల ఆటోలకు రెటిరోఫిట్మెంట్‌కు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో ఒక్కో ఆటోను రెటిరోఫిట్మెంట్ చేయిస్తే సుమారు రూ.50వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. గిరాకీ లేక కష్టకాలంలో ఉన్న ఆటో డ్రైవర్లు రూ. 50 వేలు ఎక్కడి నుంచి తెస్తారన్నారు. రాష్ట్రంలో ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. ప్రభుత్వం చోద్యం చూడడం తగదన్నారు. ప్రభుత్వం ఏడాదికి ప్రతి ఆటో డ్రైవర్‌కూ రూ.12,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చిందని వాటిని తొందరగా చెల్లించాలన్నారు. ఆటో డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. సీఎన్‌జీ వాహనాలకు ఫిల్లింగ్ స్టేషన్లు, ఎలక్ట్రిక్ ఆటోలకు తగినన్నీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# ఖర్చులు పెంచే.. జూన్ వచ్చేసింది..

### సేద్యానికి, చదువుకు పెట్టుబడి వ్యయం పెరిగే మాసం

- సాగుదారులు, సామాన్యులపై మోయలేనంత భారం
- రెండింట్లోనూ ఏటికేడు పెరుగుతున్న ఖర్చులు
- గత ప్రభుత్వంలో ఆసరాగా 'రైతుబంధు పథకం'
- ప్రస్తుతం రైతుభరోసా అందక అన్నదాతల అవస్థలు





ఇబ్రహీంపట్నం, జూన్ 14 : నిరుపేద, మధ్యతరగతి ప్రజలతోపాటు అన్నదాతల్లో జూన్ నెల గుబులు పుట్టిస్తున్నది. ఈ నెలలో వ్యవసాయానికి పెట్టుబడులు ఎంత అవసరమో.. పిల్లల చదువుకు ఖర్చులూ అంతే అవసరం. అయితే, రెండింటికీ ఒకే నెలలో అధికంగా వెచ్చించాల్సి రావడంతో సాగుదారులు, సామాన్యులు ఇబ్బందిపడుతున్నారు. జూన్ నెల గట్టెక్కేంత వరకూ అష్టకష్టాలను ఎదుర్కొంటుంటారు. గత బీఆర్‌ఎస్ హయాంలో పంటల సాగుకు ముందే రైతుబంధు పెట్టుబడి సాయం అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో అంతగా ఇబ్బందులుండేవి కాదు. కానీ, కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా పెట్టుబడి సాయం అందకపోవడంతో అటు పంటలకు పెట్టుబడులు...ఇటు పిల్లలకు పాఠశాలల ఫీజులు చెల్లించేందుకు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు నగరానికి వచ్చి అద్దె ఇండ్లలో ఉండడంతో ఖర్చు తడిసి మోపెడవుతున్నది. ఏడాదంతా దాచుకున్న సొమ్ము ఒక్క జూన్ నెలలోనే ఆవిరి అవుతున్నది. ప్రభుత్వం స్పందించి రైతుభరోసా సాయాన్ని అందిస్తే కొంతమేరకైనా పెట్టుబడులకు ఆసరాగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

### పెరిగిపోతున్న ఖర్చులు..

నర్సరీ మొదలు డిగ్రీ...ఆపై ఉన్నతస్థాయి విద్యాభ్యాసం చేయాలంటే ఖర్చులు పెడాదికేడాది పెరిగిపోతున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివితే అడ్మిషన్ ఫీజు, ఏడాది ఫీజు, పుస్తకాలు, స్టేషనరీ, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, షూ, ట్యూషన్‌ఫీజు, లంచ్ బాక్స్‌లు, వాటర్‌బాటిళ్లు, బ్యాగులు, రవాణా చార్జీలు ఇలా ఖర్చులు అధిక మొత్తంలో పెరిగిపోతున్నాయి. పాఠశాల, కళాశాలల ఆధారంగా అంతే పెద్ద మొత్తం ఖర్చు చేయాల్సి వస్తున్నది. హాస్టళ్లలో ఉంటే వాటి ఫీజులు అదనంగా భరించాల్సిందే. విద్యాసంస్థల్లో విడతల వారీగా ఫీజు చెల్లించేందుకు వెసులుబాటు కల్పిస్తున్నా పెద్ద మొత్తంలోనే విద్యా సంవత్సరం ఆరంభంలోనే వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకూ నోట్‌బుక్స్, స్టేషనరీ, వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు ట్రంక్ బాక్స్, డ్రెస్‌లు, ఇతర ఖర్చులు కూడా పెరుగుతుండడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు.


### 'సాగా'లంటే భారమే..

వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలకు పెట్టుబడి వ్యయం ఎంతో అవసరం. వ్యవసాయంలో ఎడ్లు, బండ్లు, నాగళ్లు, అరకలు దాదాపుగా కనుమరుగై యాంత్రీకరణ అమాంతంగా పెరిగిన నేపథ్యంలో పెట్టుబడులు పెనుభారమవుతున్నాయి. ఏ పంట వేయాలన్నా ట్రాక్టర్‌తో దున్నించినందుకు ఎకరానికి రూ.20 వేలకు పైగానే ఖర్చవుతున్నది. ఇక విత్తనాలు, ఎరువులు, నాట్లు వాటి ఖర్చులూ గణనీయంగా పెరిగాయి. అన్నదాతను ఆదుకునేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం వానకాలం, యాసంగి సీజన్లకు కలిపి ఎకరానికి రూ.10 వేలను సకాలంలో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం, ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై ఇవ్వడం వంటివి అన్నదాతలను ఆర్థికంగా ఎంతగానో ఆదుకున్నాయి. కాంగ్రెస్ వచ్చాక ఆ పరిస్థితి లేకుండా పోవడంతో కర్షకులు మళ్లీ అధిక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. మళ్లీ వెనుకటి కాలం వచ్చిందని, పెట్టుబడులు పెట్టలేక వ్యవసాయాన్ని వదిలి మళ్లీ బొంబాయి, దుబాయి ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.

### పెట్టుబడి సాయం అందించాలి

వానలు కురుస్తుండడంతో అన్నదాతలు వరి, కూరగాయల పంటలను సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో అదునుకు ముందే పంటల సాగు కోసం పెట్టుబడి సాయం అందేది. కానీ, కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత.. పంటల సాగు ప్రారంభమైనా నేటికీ రైతు భరోసా సాయం అందలేదు. కూలీలు, ట్రాక్టర్ల ధరలు పెరిగిపోవడంతో ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేసి ఆదుకోవాలి.

-చిలుకల బుగ్గరాములు



మహిళా విభాగంలో బాధ్యతలు తీసుకున్న నాయకురాళ్లు

**గుడ్‌మార్నింగ్ మణికొండ అద్భుతం**

### కాంగ్రెస్ పాలనలో

# అభివృద్ధి శూన్యం

### మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మణికొండ, జూన్ 14 : మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన గుడ్‌మార్నింగ్ మణికొండ-ప్రజాభిప్రాయ సేకరణ ఆదర్శనీయమైనదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నిత్యం ప్రజల్లో ఉంటూ ..వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న 'గుడ్‌మార్నింగ్ మణికొండ'-ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమ శత దినోత్సవాన్ని పార్టీ అధ్యక్షుడు సీతారాం ఆధ్వర్యంలో అల్కాపూర్ టౌన్‌షిప్ సెలబ్రెటీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. దీనికి బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. 'గుడ్‌మార్నింగ్ మణికొండ' వంద రోజులు దిగ్విజయంగా ముగించుకున్న సందర్భంగా ఆమె పార్టీ శ్రేణులను అభినందించారు. దాదాపు రెండు లక్షల పైచిలుకు జనాభా ఉన్న మణికొండ మున్సిపాలిటీలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బీఆర్‌ఎస్ సర్కారు రిజర్వాయర్లను నిర్మించిందన్నారు. నగర శివారు ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని ఆనాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 1260 కోట్ల నిధులను మంజూరు చేసి మిషన్ భగీరథ ఫేస్-2 ద్వారా తాగునీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందించిందని వివరించారు. కార్మికులకు రూ. 6 వేల నుంచి రూ.14వేల వేతనాలను పెంచిందన్నారు. మణికొండ మున్సిపాలిటీలో ఇంటి పన్నుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గుడ్‌మార్నింగ్ మణికొండ-ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని మహేశ్వరం నియోజకవర్గంలోనూ అమలు చేసేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఏడాదిన్నరగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్న విషయం ప్రజలకు అర్థమైందన్నారు. 'గుడ్‌మార్నింగ్ మణికొండ'లో సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ శ్రేణులు చేస్తున్న కృషి అద్భుతమన్నారు. ఇదే తరహాలో ప్రజల్లోనూ బీఆర్‌ఎస్ శ్రేణులు సంపూర్ణ విశ్వాసాన్ని కల్పించాలని సూచించారు. 'తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారుకు కాలం చెల్లిందని.. అది చేసిన అభివృద్ధి ఏమి లేదని.. అంతా శూన్యమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ పాలన వస్తేనే మనందరి జీవితాలు బాగుపడతాయని ప్రజలందరూ నిర్ణయించుకున్నారని.. వారందరికీ అండగా గులాబీ జెండా అండగా ఉండాల'ని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి సూచించారు.

### కార్యవర్గంలో బాధ్యతల కేటాయింపు

మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ ప్రత్యేక సలహాదారు, ఆఫీషియల్ స్పోక్‌పర్సన్‌గా ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి, కార్యదర్శిగా ఖలీం, మైనార్టీ విభాగం ప్రతినిధిగా షేక్ ఆరీఫ్, కార్యదర్శిగా అశోక్ నియ మితులయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మణికొండ మున్సిపాలిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు రూపారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, మల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.